సింగిల్ పేజీ కథ

# కొత్త కెరటం

ఎస్.కె. కాలేషా

బోసు అడుగులు ఇంటివైపు భారంగా పడుతున్నాయి. రోడ్డు వెనక్కి తరుగుతున్న కొద్దీ అతడి గుండె భారమై, ఉద్వేగానికి లోనవుతోంది.

అతడు ఇంట్లో ప్రవేశించగానే అక్కడ క్రియేట్ అయ్యే వాతావరణాన్ని ఊహించుకుంటున్నాడు.

"గుమ్మం ఎక్కకు. ఇప్పుడు గుర్తొచ్చామా నీకు"

"ఏం మొహం పెట్టుకొచ్చావు?"... లాంటివి వినిపిస్తాయా?

అతడి తండ్రి 'అగ్గిమీద గుగ్గిలం' అవ్వడం మాత్రం తప్పనిసరి.

"అనుకున్న పని చెయ్యాలనుకున్నప్పుడు లేని బెరుకు. భయం చేసేసిన తర్వాత మాత్రం ఎందుకు కలగాలి?" అని తనకి తానే భరోసా ఇచ్చుకుని. గుండె దిటవు చేసుకొని నడక వేగాన్ని పెంచేడు బోస్.

చిన్నప్పటి నుంచి తండ్రి ఎదురుగా మాట్లాడ్డమంటే బోసుకి భయమే. తండ్రంటే అంత భక్తి!

కాలేజ్‌లో టర్మ్‌ఫీజ్ కట్టాలంటే చెల్లెలిచేత తండ్రికి చెప్పించేవాడు బోస్.

"జ్ఞాపకాలన్నీ కళ్ళముందు కదలాడుతున్నాయి. ఇంటితో బంధం తెంచేసుకోమని బోస్‌కి ఉత్తరం రాశాడు తండ్రి.

అయినా మమకారాన్ని చంపుకోలేక. గుండెని స్పందనలు లేని పాషాణం చేసుకోలేక. ఏదో మూల మెదులుతోన్న చిన్న ఆశతో. ఇంటికి బయల్దేరాడు. వస్తున్నట్లుగా ఉత్తరం కూడా రాశాడు. తనూహించింది జరక్కూడదనీ. జరగదనీ అనుకుంటున్నాడు.

ఎవరో పిలిచారు "బోసూ.. బోసూ...?

ఆలోచన్లు ఆపేసి 'ఎవరా?' అని చూశాడు.

ఆంజనేయులు మాష్టారు. బోస్ తండ్రికి శ్రేయోభిలాషి. ఒక రకంగా కుడిభుజంకూడా.

"నమస్తే మాష్టారూ... క్షేమమా?

బ్రీఫ్‌కేస్ క్రిందపెట్టి రెండు చేతులూ జోడించేడు బోస్.

"పెళ్ళి చేసుకున్నావట కదా... కనీసం నాలాంటి వాళ్ళకి శుభలేఖలు పంపినా వచ్చుండేవాళ్ళం. తన మాటని ధిక్కరించి ప్రవర్తించావనీ, గౌరీపతి కూతురికి అన్యాయం జరిగిపోతుందేమోననే బాధ తప్ప ఇంకేం లేదు మీ నాన్నకి. మీ అమ్మ మాత్రం అడకత్తెరలో పోకచెక్కలా నలిగిపోతోంది..." అన్నారు ఆంజనేయులు మాష్టారు.

"అదిసరే అన్నీ తీరిగ్గా మాట్లాడుకోవచ్చు. అమ్మాయేది? తీసుకురాలేదా?"

"లేదు మాష్టారూ తీస్కురాలేదు. ఇక్కడ ఎలాంటి పరిస్థితులు ఎదుర్కోవలసి వస్తుందోనని భయపడి నేనే వద్దన్నాను. నాన్నగారు..." అని సంశయిస్తోంటే...

"నీకేం భయంలేదు. నిర్భయంగా వెళ్ళు" అని మాష్టారు ధైర్యం చెప్పారు. బోస్‌కి కొంత ధైర్యం వచ్చింది. గానీ తండ్రి మనస్తత్వాన్ని తలుచుకుంటుంటే



ఆకాస్త ధైర్యం సన్నగిల్లి పోయింది.

"నన్ను సమర్థించే మామయ్యింటికి వెళితే... అనుకున్నాడు. కానీ మామయ్యింటికి వెళ్ళడానికి మనస్కరించలేదు.

"వాళ్ళింటికి వెళ్ళే అర్హతని పోగొట్టుకున్నాను. అత్తయ్య. మామయ్య నన్ను మరీ అసహ్యించుకుంటారు." అనుకున్నాడు.

మేనమామ గౌరీపతి కూతుర్ని బోస్‌కిచ్చి చెయ్యాలని అనుకున్నారు ముందు. కానీ బోస్ మరో అమ్మాయిని పెళ్ళి చేసేసుకున్నాడు. అది బోస్ తండ్రికి ఇష్టం లేదు.

... ఇల్లు దగ్గరైంది.

జీవితంలో ఎన్నడూ అనుభవించని ఉద్విగ్నత అతడి మనస్సుని కమ్ముకుంది.

సావిట్లోకి అడుగుపెట్టగానే అతడి మేనమామ గౌరీపతి కంఠం వినిపించింది లోపల్నుంచి.

"నువ్వలా భీష్మించుకు కూర్చుంటే లాభం లేదు బావా! వాళ్ళు వచ్చే టైమైంది. నువ్వు వాళ్ళని ఆహ్వానించనవసరం లేదు. ఏం అనకుండా ఉండు చాలు. ముందు ఏదో అనుకున్నాం కానీ అందుకు భిన్నంగా జరిగింది. అయినా అన్నీ మనం అనుకున్నట్లే జరుగుతాయేమిటి? బోస్ నాకూతుర్ని చేసుకోలేదనే బాధ నాకు ఎంతమాత్రం లేదు. ఇక ఆ విషయం మరిచిపోదాం. బోస్ ఎవరో అమ్మాయిని భార్యగా స్వీకరించాడంటే నిజానికి నేను ఎక్కువ బాధ పడాలి. నాకు లేని బాధ నీకెందుకు? కాలంతో బాటు మనమూ మారాలి బావా. తప్పదు. తరం మారింది." నచ్చ చెప్తున్నాడు గౌరీపతి.

"బస్సొచ్చేటైమైంది. నేను వెళ్ళి తీసుకొస్తా. అక్కా... నువ్వు హారతి పళ్ళెం సిద్ధం చేసి ఉంచు." అని బైటకి వెళ్ళే ప్రయత్నంలో సావిట్లో కొచ్చేడు గౌరిపతి.

బోస్ కనిపించాడు. ఇద్దరూ కలిసి లోపలికొచ్చారు. బోస్ కేసి తండ్రి తీక్షణంగా చూశాడు. చూపులతో శిక్షించడం ఆయనకి అలవాటు.

ప్రతి క్షణం భారంగా గడుస్తోంది.

"కోడల్ని తీస్కురాలేదా?" చూపులో తీక్షణతని తగ్గించి అడిగేడు తండ్రి.

అక్కడున్న అందరి మనసులూ తేలిక అయ్యాయి.

"మొదట్లో కొత్తని వ్యతిరేకిస్తాం... పాతయ్యాకా దాన్నే అనుసరిస్తాం." అంటూ బోస్‌ని కౌగలించుకున్నాడు తండ్రి.

"టెలిగ్రామ్ ఇచ్చేయ్ కోడల్ని తీస్కురమ్మని మీ మామగారికి."

★